# పోటీ

"పక్కింటి పిల్లలు చూడు, ఎంత శుభ్రంగా వుంటారో! వీడో రోజుకు రెండుసార్లు స్నానాలు చేయించినా మురికి మురికే" అన్నది అమ్మ విసుగ్గా. "ఫో! వెధవా ఫో! కాళ్ళూ మొకమూ కడుక్కోపో" అని కసురుకున్నాడు నాయన. ఆ వెధవ కప్పటికి ఎనిమిదేళ్ళు. ఆ తర్వాతకూడా అమ్మానాయిన వాడినిపక్కింటిపిల్లలతో పోల్చిచూడడం, తిట్టడం ......... వాడికి తెలిసిందే. మొదట్లో అమ్మానాయినా తనని పక్కింటి పిల్లలతో పోల్చిచూసి, తిట్టినా ........... తననూ పక్కింటి పిల్లలనూ పోల్చిచూసుకోవడం వాడికి తెలిసేది కాదు. తెలిసిన తర్వాత పోల్చిచూసుకుంటే, వాడికి కొన్ని సంగతులు తెలిసాయి.

నిజమే, వాళ్లు తనకంటే బావున్నారు. ఖరీదైన బట్టతో అందంగా కుట్టిన దుస్తులతో, కాళ్ళకు నిగనిగ మెరిసే చెప్పుల్తో వున్నారు. తన నిక్కరూ, చొక్కా ఎక్కడో వీధిలో పరుచుకున్న వాడిదగ్గర కొనుక్కొచ్చినాడు నాయిన. పండుగ మర్నాడేననీ, అందరూ పిల్లలకూ పెద్దలకూ, అన్నన్ని బట్టలు తెచ్చుకుంటుంటే, ఆ ఏలెడు 'పిల్ల వెధవ' కు ఒక చొక్కా నిక్కరుపాతా తేలేకపోయామనీ అమ్మ ఏడిస్తే, తెచ్చినాడు నాయన. టైలర్ కిచ్చి, కుట్టించడానికి టైమ్ లేదు గనుక, కుట్టినవే తెచ్చినాడు. అవి వాడికంటే పెద్దసైజువి. పెరిగేవాడు కనుక, కొంచెం పెద్ద సైజువయితేనే మంచిదనీ, డబ్బుదండుగ కాకుండా వుంటుందనీ చెప్పినాడు. పెరిగేది తనొక్కడే కాదనీ, తనకెప్పుడూ పోటీగా వుంటున్న పక్కింటి పిల్లలు కూడా పెరుగుతారనీ, అయినా వాళ్ళ అమ్మానాయినా వాళ్ళకు సరిపడిన సైజువే కుట్టించారనీ ........... వాడి కప్పుడు తెలీదు. అందుకనే వాళ్ళ నాయిన్ను అడగంది.

నాయిన కొనుక్కొచ్చిన ఆ రెడీమేడ్ నిక్కరు కిందికి జారి నడుం కింద రెడీమేడ్‌గా వుంటుంది. పక్కింటి పిల్లలు నిక్కర్ల మీద నల్లని తోలు బెల్టులు పెట్టుకుంటారు. అట్లా తను కూడా పెట్టుకోవాలని వాడి కెన్నాళ్ళ నుంచో కోరికగా వుంది. ఇప్పుడెట్లాగూ నిక్కరు జారిపోతోందికదా.......... అట్లాంటి బెల్టు కావాలన్నాడు. "చూద్దాంలే" అన్నాడు నాయిన.

వాళ్ళ నాయిన నల్లని తోలు బెల్టు తెచ్చినట్టూ, అది పెట్టుకుని తను అందరికీ చూపినట్టూ ఎన్నో సార్లు ఊహించుకున్నాడు వాడు. నిద్రలో అట్లాంటి కల కూడా వచ్చింది. చూద్దాంలే, అన్న నాయిన ఎన్నాళ్లకూ చూసినట్టు లేక పోవడంతో, మళ్ళా మళ్లా అడిగినాడు. ఏడ్చినాడు. "బెల్టెందుకు? రొండ్రూపాయలు దండగ. మొల్తాడుందిగా, పైనేసుకో" అన్నాడు. వాడు తెల్లబోయి సూసినాడు. 'చూద్దాంలే' అంటే తెస్తాడనే అనుకున్నాడు. రొండ్రూపాయలు పెట్టి తెచ్చినా ఆ ముండా బెల్టు లుండవనీ, వూరికినే పుటుక్కున తెగిపోతాయనీ...... వివరించి, వాడి బెల్టు కలలను కూడా పుటుక్కున తెంపేశాడు! పైగా, వాడు జారిపోతోన్న నిక్కరులో కనిపించినప్పుడల్లా ......... "మొల్తాడు పైన వేసుకోరా వెధవా!" అని తిట్టేవాడు.

వాడినెప్పుడూ పక్కింటి పిల్లలతో పోల్చిచూడడం తప్ప పక్కింటి పిల్లల అమ్మా నాయినలతో తమను పోల్చివాళ్ళు ఎప్పుడూ చూసుకోలేదు. పక్కింటి పిల్లల బట్టలు చూసినప్పుడు కూడా. "ఎందుకంత ఖరీదైనవి? పిల్లల బట్టల కంత లెక్క తగలెయ్యాల్నా! వున్న వాళ్ళమని పొగరు" అనే వాళ్లు. మొత్తం మీద తాము వుంటున్న పద్ధతే సరైనది......... తాము తమ పిల్లవాడిని పెంచుతున్న పద్ధతే మంచిదని అనుకుంటున్నట్టు మాట్లాడుకునేవాళ్ళు. మరి, పక్కింటి పిల్లల్తో తనను పోల్చి ఎందుకు తిడతారో......... వాడికి అర్థమయ్యేది కాదు. ఆ పిల్లల అమ్మానాయినల్తో తమను పోల్చి చూసుకోవడం వల్ల వాళ్లు తనను తిడుతూ వుండినట్టు......... పెద్దవాడయ్యే దాకా వాడికర్థం కాలేదు.

"ఒరే మొద్దు వెధవా! రవిన్ని చూడు, ప్రతీసబ్జెక్టులో ఎనభై, తొంభైమార్కులు తెచ్చుకున్నాడు! నీకు దేంట్లోనూ ముప్పయ్ దాటలేదు. వాడిని చూసన్నా తెలివి తెచ్చుకో......." అని తిట్టినాడు మునిసిపల్ హైస్కూల్లో కనకరాజు టీచర్. అప్పటికీ 'మొద్దువెధవ'కి పదిహేనేళ్ళొచ్చినాయి. ఎంత మొద్దు వెధవైనా, రవి కన్ని మార్కులెట్లా వస్తున్నాయో తెలుసు. అతను కనకరాజు సార్ కాడికి ప్రైవేటుకు పోతాడు. తను నెలక్కు పదిరూపాయలిచ్చి పోలేడు. "సెర్దగా సదివేవాడికి ప్రైవేట్లెందుకు?" అంటాడు నాయన. ప్రైవేటుకు పోకపోతే, 'సెర్దగా' సదువుసెప్పరని నాయినకు తెలీకనే అంటాడో, తెలిసినా అంటున్నాడో తెలీదు. చలపతిని కూడా అట్లాగే కనకరాజు సార్ తిడుతూండే వాడనీ, ఇప్పుడు చలపతి తనదగ్గరకే ప్రైవేట్ కు పోతుండడం వల్ల తిట్టడం మానేసాడనీ వాడికి తెలుసు.

★ ★ ★

ఆ మొద్దువెధవ, అట్లాగే చదువుకొన్నాడు. ఉద్యోగందగ్గర మళ్ళాగట్టి పోటీ నెదుర్కొన్నాడు. అందులో అటు కొట్టుకుని, ఇటు కొట్టుకుని ......... ఆఖరుకు ప్రైవేటుకంపెనీలో

ఓ చిన్న ఉద్యోగం అనే పూచికపుల్ల పట్టుకుని ఒడ్డున పడ్డట్టు ఊపిరి పీల్చుకుందామనే లోపల.......... పెళ్ళాం మళ్ళీ ఎదురింటి అతన్తోనూ, పక్కింటి అతన్తోనూ పోటీకి నెట్టుతోంది. పాపం......... ఆమె కూడా కట్నాల పోటీలో పాల్గొని నెట్టుకొచ్చిన మనిషే కదా! పోటీలో గెలిచినా, ఓడినా............ లేక గెలుపూ ఓటమి అనుభవాలను చవిచూసినా, క్రీడాస్ఫూర్తి అంటే అంత ఇష్టం! అయితే, ఈ పోటీలో పాల్గొనాలన్న ఉత్సాహం, ఆసక్తి, శక్తి ఉన్నవాళ్ళే పోటీలో వుండటం న్యాయం. ఆసక్తి, స్ఫూర్తి లేని తన వంటి వాళ్ళను వదిలెయ్యడం న్యాయం. విషాదం పోటీలో పాల్గొనడంలో లేదు, పాల్గొన లేకపోవడంలో వుంది కనుక.

ఇట్లా అనుకునేటప్పటికి నారాయణకు విషాదపు నవ్వొచ్చింది. చేతిలో 'కథల పోటీ' ప్రకటన కవ్వించాలని చూస్తోంది. పత్రికలో కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నదదే. అట్లా కనిపించాలన్నదే ఆ పత్రిక వాళ్ల ఉద్దేశం. నిబంధనలన్నీ మామూలే. ఆ పోటీ కూడా మామూలే. ఏటికేడాదీ బహుమతి డబ్బు పెంచవలసి రావడమే విశేషం. ఆ విశేషం ఒక్కటుంటే చాలేమో, ఆ వొక్కటే పోటికి లాగుతుందేమో! చిన్న కథకు.......... రెండు వేల రూపాయలు! రెండువేలరూపాయలు ఎన్ని వందల చిన్న అవసరాల్ని (తనపాలిటికి పెద్ద) తీరుస్తాయో! తను ఆ రెండు వేల రూపాయల బహుమతొచ్చే కథను రాయగలిగితే! ప్రయత్నిస్తే........ మంచి కథ కూడా రాయొచ్చేమో కానీ, ఆ రెండువేల రూపాయల బహుమతొచ్చే కథను రాయగలడన్న గ్యారంటీ లేదు. ఈ కథల పోటీ వాళ్ళు ఎందరు పోటీలో పాల్గొన్నా. ఎవరెంత మంచి కథ రాసినా, తమకు నచ్చిన కథకు మాత్రమే బహుమతి ఇస్తామన్న సంగతిని మరుగు పరచి........ మంచి కథకు బహుమతి ఇస్తున్నట్టు నమ్మిస్తారు! డబ్బుకఱ్ఱవీపున పెట్టి పోటీలోకి తోస్తారు. ఎంత పెద్ద బహుమతైతే, అంత పెద్ద, బలమైన కఱ్ఱన్న మాట.

నిజానికి ఎవరైనా రచనలెందుకు చేస్తారు. తన అనుభవాల ఆధారంగా ఏర్పడిన ఆలోచనలను నలుగురితో పంచుకోడానికి. అందులో పోటీ ఎందుకు? ఆ అవసరమేముంది? పోటీ అవసరం లేనిచోట, అందరి అవసరాలూ, పరిస్థితీ ఒకటి కాని చోట పోటీ ఏమిటి? అందర్నీ పాల్గొనమనడమేమిటి?

చిన్నప్పుడు, తనకేమీ తెలీనప్పుడు, పోటీలో పాల్గొన గలిగే అవకాశాలే లేనప్పుడు............ ఆ అవకాశాలు కల్పించవలసిన అమ్మా నాయినా ఆ సంగతి ఆలోచించకుండా తనని పోటీలోకి నెట్టారు! ఆ తర్వాత గురుదేవుడైన కనకరాజు సార్, సహధర్మచారిణీ, అర్ధాంగీ అయిన భార్య, ఇప్పుడు యీ కథల పోటీ వాళ్లు అందరూ పోటీలోకి నెట్టే వాళ్ళే! ఆ పోటీలో పాల్గొనాలన్న ఆసక్తి తనకుందో లేదో తెలుసుకున్నవాళ్ళెవరూ

లేరు. ఎదురింటి 'భర్త' తో పోటీ పడు, మిగతా రచయితల్తో పోటీ పడు! పోటీ పడకుండా నాకు సాధ్యమైనట్టూ, ఇష్టమైనట్టు బతుకు తానంటే...... వీల్లేదు.

కథల పోటీ ప్రకటన వున్న పత్రికను పక్కనపడేశాడు నారాయణ. అయినా ఆ ప్రకటన రెండంకెలతోనూ మూడుసున్నాలతోనూ తిరుగుతూ నారాయణ మెదడును నలుపుతూనే వుంది. పోటీలో పాల్గొనడంలో లేదు విషాదం, పాల్గొనలేకపోవడంలో వుంది.

*('యువ' లో ప్రచురితం. రచనాకాలం తెలీదు. బహుశా 1973, 74 కావచ్చు)*

# -- కథ గురించి. . .

పోటీ పడటం వల్ల కొంత అభివృద్ధిని సాధించవచ్చునేమో! అయితే, అటువంటి అభివృద్ధి స్వచ్ఛందంగా పోటీ పడినప్పుడు మాత్రమే సాధ్యం. ఇంకొకరు పెట్టిన పోటీలో పాల్గొనే వాళ్లకు ఆ అవకాశం వుండదు. పోటీ పెట్టిన వాళ్లు కోరిన రూపంలో, ఆశించిన పరిమితిలో ఆ అభివృద్ధి వుండక తప్పదు.

ఒక కథల పోటీ ప్రకటన యీ కథ రాయడానికి ప్రేరణ అయినట్టు జ్ఞాపకం. అందుకే యీ కథలో పాత్ర "మంచి కథ రాయడం సాధ్యం కావచ్చు నేమోకానీ, బహుమతి లభించే కథ రాయడం కష్టం" అనుకోవడం. అయితే యీ కథ ఆ కథల పోటీ ప్రకటన మేరకే పరిమితమైవుంటే, మళ్ళీ జ్ఞాపకం తేవలసిన అవసరం వుండేది కాదు. చిన్నప్పట్నుంచీ తనకు సంబంధించని, అనుకోని పోటీలోకి ఎట్లా నెట్టబడుతూ వచ్చిందీ కథ గుర్తు చేస్తుంది. సృజనాత్మకమని చెప్పుకునే సాహిత్యంలోకి కూడా పోటీ ప్రవేశించడాన్ని తాత్విక ధోరణిలో వ్యక్తం చెయ్యడం ఇందులోని ఇతివృత్తం.

అన్ని రంగాలలోనూ, పోటీ తీవ్రతర మవుతున్న, అవనున్న వర్తమాన, భవిష్యత్తులకు కూడా యీ అంశం వర్తిస్తుందని యీ కథ.